క్లుప్తంగా

సత్తా చాటుతున్న మహిళలు


ఉపాధ్యాయిని కనకదుర్గను సత్కరిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం భారతీదేవి

నల్లజర్ల: మహిళలు అన్నింటా సత్తా చాటుతున్నారని నల్లజర్ల-1పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భారతీదేవి అన్నారు. గురువారం పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని కనకదుర్గను శాలువాతో, పూల మాలలతో సత్కరించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మరో ఉపాధ్యాయిని కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండి స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో మహిళాసాధికారిత సాకారమైందన్నారు.

11న మున్సిపల్ సమావేశం

కొవ్వూరు: ఈనెల 11వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పథకాలపై సభ్యులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. కావున సభ్యులంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రసాద్ నిర్మాణాలకు శ్రీకారం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత


రత్నగిరిపై శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత, ఏపీటీడీసీ ఎండీ మల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ తదితరులు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో మరో కీలక అంకానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీకారం చుట్టారు. పిల్‌గ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మంటేషన్ డ్రైవ్ ('ప్రసాద్') స్కీం కింద దేశవ్యాప్తంగా రూ.6,400 కోట్లతో 53 ప్రాజెక్టులను ఏక కాలంలో ప్రధాని మోదీ గురువారం జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీ నగర్ నుంచి వర్చ్యువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వాటిలో సత్యనారాయణస్వామి దేవస్థానానికి 'ప్రసాద్' స్కీం కింద మంజూరు చేసిన రూ.20.06 కోట్లతో చేపట్టనున్న నిర్మాణ పథకాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ ఆలయ పర్యాటక అభివృద్ధికి 'ప్రసాద్' స్కీం తోడ్పడుతుందని తెలిపారు. ప్రసాద్ స్కీం శిలాఫలకాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ ఆవిష్కరించారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఎండీ, అరవేటి లక్ష్మీ మల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఏసీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

మరిన్ని 'ప్రసాద్' నిధులకు ప్రయత్నం

రూ.92 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందచేయగా రూ.54 కోట్లకు డీపీఆర్ కూడా అయింది. మిగిలిన రూ.34 కోట్లు రాబట్టేందుకు ప్రయత్నం చేస్తానని ఎంపీ గీత తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే టెండర్లు పిలిచి, ఖరారు చేసి పనులు పూర్తి చేయాలని టూరిజం అధికారులను కోరామని ఈఓ కే రామచంద్రమోహన్ చెప్పారు.

ప్రసాద్ నిర్మాణాల వివరాలు

రూ.11,50,68,000 అంచనా విలువతో రెండంతస్తుల్లో అన్నదానం భవనం, రూ. 05,94,86,000 అంచనా వ్యయంతో భక్తుల క్యూ కాంప్లెక్స్, రూ.61,85,000 అంచనా విలువతో భక్తుల టాయిలెట్ బ్లాక్, రూ.1,02,57,000 అంచనా వ్యయంతో ఎలక్ట్రానిక్ కార్లు నాలుగు, చార్జింగ్ స్టేషన్లు రెండు నిర్మించనున్నారు.


ప్రసాద్ నిధులతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్(నమూనా)

పేదలందరికీ ఇళ్ల పట్టాలు

- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల అందజేసిన ఎమ్మెల్యే తలారీ వెంకట్రావు.
- జెడ్పీహైస్కూల్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన భవనం ప్రారంభం


చాగల్లులో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారీ వెంకట్రావు, నాయకులు

చాగల్లు : నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద ఇళ్ల పట్టాలు అందజేయడం చారిత్రాత్మక నిర్ణయమని కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. చాగల్లు గ్రామంలో సచివాలయం వద్ద ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలు గురువారం అందజేశారు. జగనన్న కాలనీలో నివేశన స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఎమ్మెల్యే తలారీ వెంకట్రావు చేతులమీదుగా అందజేశారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నాడు నేడు ఫేజ్-2లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే తలారీ వెంకట్రావు ప్రారంభించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, మండల వైస్సార్‌సీపీ గౌరవధ్యక్షులు, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ మేకా రాజు, ఎంపీటీసీలు ఉన్నమట్ల విజయకుమారి, సానబోయిన అర్జునుడు, అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాగల్లు: అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షుడు మట్టా వీరాస్వామి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ఆయా గ్రామాల్లో వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

మహిళలు మహారాణులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను మహారాణులుగా గుర్తించారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం అనంతరం మహిళాదినోత్సవం పురస్కరించుకుని మహిళా అధికారులను, మహిళా ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, ఎంపీడీవో ఎస్ బుజ్జి, తహసీల్దార్ ఎం.సావిత్రి, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

నిడదవోలు: ఇచ్చిన మాట నెరవేరుస్తూ వరుసగా నాలుగో ఏడాది ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా బటన్‌నొక్కి నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణంలోని 6వ సచివాలయం వద్ద గురువారం లబ్ధిదారులు సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ పువ్వుల రతిదేవి, గంగుల గోపీయాదవ్, కె.కల్యాణి, బత్తుల నాగమణి, షెక్ ఫాతిమా, మందపాటి సత్యవతి, తాడికొండ సత్యవతి, ఇమ్మడి పద్మావతి, టి.మంగతయారు, షేక్ రజియాబేగం, కోన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరకంచి బ్యాంక్ దొంగల పట్టివేత


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచి గ్రామంలో ఫిబ్రవరి 7వ తేదీన స్టేట్‌బ్యాంక్‌లో జరిగిన చోరీకి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ చోరీకి పాల్పడింది ఏడుగురు దొంగలు. మహారాష్ట్రకు చెందిన అక్షయ్ గజానన్, వైభవ్ నారాయణ్‌రావు, హరీష్ మిలింద్ గైక్వాడ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దస్వీర్ సహా మరో ముగ్గురు ఈ నేరానికి పాల్పడ్డారు.

గూగుల్ మ్యాప్‌లో వెదికి..

గూగుల్ మ్యాప్‌లో ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌ను గుర్తించి దొంగతనానికి వ్యూహరచన చేశారు. మండపేటలో దుప్పట్లు అమ్మే వ్యక్తులుగా కాలు మోపారు. కొన్నాళ్లు స్థానికంగా దుప్పట్లు విక్రయిస్తూ లాడ్జిలో నివసించారు. ఈ లోపు మండపేట బ్యాంకుపైనా కన్ను పడింది. అయితే కట్టుదిట్టమైన భద్రతా చర్యల వల్ల వెనక్కి తగ్గి గూగుల్ మ్యాప్‌లో గుర్తించిన ఉత్తర కంచి బ్రాంచ్‌కే ఫిక్స్ అయ్యారు. మండపేటలో ఉంటూనే ఉత్తరకంచి బ్యాంకు చుట్టూ తిరుగుతూ కొన్ని రోజుల పాటు రెక్కీ నిర్వహించారు. తమ ముఖాలు గుర్తు పట్టకుండా మారు వేషాల్లో కూడా తిరిగారు. సామర్లకోటలో కొంతమందితో పరిచయాలు పెంచుకున్నారు. ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.

చోరీ చేశారిలా..

ఏడుగురు కలిసి తమ సొంత కారులో ఉత్తర కంచి శివారుకు ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చేరుకున్నారు. శ్మశానం వద్ద ఆరుగురు దిగిపోయి, వాహనం నడిపిన హరీష్‌ను కారు తీసుకు వెళ్లిపొమ్మని చెప్పారు. పని పూర్తయ్యాక చెబుతాం రావాలని సూచించారు. పొలాల మీదుగా బ్యాంకు వెనుక భాగానికి చేరుకున్నారు. అప్పటికే తెచ్చుకున్న పరికరాలతో కిటికీని తొలగించి లోపలికి చేరారు. అలారం, సీసీ కెమెరాల వైర్లను కత్తిరించారు. స్ట్రాంగ్ రూం తాళాలు గ్యాస్ కట్టర్ సాయంతో కత్తిరించారు. నాలుగు లాకర్లలో రెండు తెరిచారు. అందులో ఉన్న రూ.27.34 లక్షల నగదుతో పాటు రూ.1.19 కోట్ల విలువైన 3.28 కిలోల బంగారాన్ని తమతో తెచ్చుకున్న సంచుల్లోకి నింపుకున్నారు. వచ్చిన మార్గం గుండానే మెయిన్‌రోడ్డు వరకు వెళ్లి అప్పటికే కారుతో ఎదురుచూస్తున్న హరీష్‌తో కలిసి అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లారు.

నలుగురు కారులో... ముగ్గురు ట్రైన్‌లో...

నగదు, నగలు దోచేసి వెళుతూ బ్యాంకు నుంచి క్యాష్ కౌంటింగ్ మెషీన్, ఎలక్ట్రానిక్ కాటాలను కూడా దొంగిలించారు. వాటి సాయంతో డబ్బు లెక్కించి, బంగారం తూచి తెల్లవారుఝామున 4 గంటల సమయంలో పంపకాలు పూర్తయిన తర్వాత నలుగురు కారులో మహారాష్ట్రకు, ముగ్గురు రైలులో ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరారు.

నిందితులంతా 25 ఏళ్ల లోపు వారే..

నిందితుల్లో నలుగురు పట్టుబడగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. నిందితులంతా పాతికేళ్ల లోపు వారేనని, వీరి నేర చరిత్ర తెలుసుకునేందుకు వివిధ రాష్ట్ర పోలీసులతో సంప్రదింపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో కేసు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సారథ్యంలో ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతి మిశ్రా పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ సాయిఈశ్వర్, సీఐలు శేఖర్ బాబు, అంకబాబు, చిట్టిబాబు, చైతన్యకృష్ణ, సురేష్, నాగేశ్వర్‌నాయక్, కృష్ణభగవాన్, మూర్తి, శ్రీనివాస్, ఇతర పోలీస్ బృందాలతో పాటు ఐటీ కోర్ కీలకంగా వ్యవహరించిందని అన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

బీసీలంటే బ్యాక్ బోన్ క్లాసులు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- 9న చాగల్లులో బీసీ ఆత్మీయ సదస్సు
- 10వేల మందితో సభ ఏర్పాటు
- హాజరు కానున్న బీసీ ప్రముఖ నేతలు, మంత్రులు


కొవ్వూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: బీసీలంటే వెనుకబడిన కులాలు కాదని, బ్యాక్ బోన్ క్లాసులని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అందుకే అన్నీ రంగాల్లోను బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బీసీ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గంలో 75 ఏళ్ల కాలంలో బీసీ వ్యక్తికి ఎంపీ టిక్కెట్ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని అన్నారు. టీడీపీ పాలనలో బీసీలకు కత్తెరలు, ఇస్త్రీ పెట్టె ఇచ్చి ఏదో పెద్ద మేలు చేసినట్లు గొప్పలు చెప్పుకునేవారన్నారు. ఇప్పుడు జగనన్న బీసీలకు 59 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి గుర్తింపు లేని ఎన్నో కులాలను వెలుగులోకి తెచ్చారన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు 50శాతం మంది బీసీలకు సుముచిత స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు కేవలం బీసీలను తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారన్నారు. జగనన్న పాలన బీసీలకు చేసిన మేలని తెలియజేసేందుకు ఈ నెల 9వ తేదీన చాగల్లులో శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో సాయంత్రం మూడు గంటలకు బీసీ ఆత్మీయ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు పలువురు బీసీ ప్రజాప్రతినిధులు, మంత్రులు హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు అనసూరి పద్మలత, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి, ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ మాట్లాడుతూ చాగల్లు బీసీ సభను దిగ్విజయం చేయాలని కోరారు. బీసీ సదస్సు పోస్టర్‌ను ఎమ్మెల్యే, నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న,సుంకర రాయుడు, ముదునూరి సూర్య నారాయణరాజు,నక్కా చిట్టిబాబు, పొన్నాడ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, నాయకులు సమన్వయంతో ఉండాలి

- ఎంపీపీ సత్యనారాయణ
- మండల పరిషత్ సమావేశం

గోపాలపురం: అధికారులు, నాయకుల సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అధికారులకు ఆయా గ్రామాల నాయకులు సహకరించాలని సూచించారు. ఎంపీడీఓ కె.రమేష్‌బాబు, తహసీల్దార్ కె.వనజాక్షి, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాష్కరరావు, వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

రూ.403 కోట్ల నిధులతో పట్టణాభివృద్ధి


కౌన్సిల్ సమావేశంలో డైమండ్ జూబ్లీ లోగోను ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పురపాలక పాలక సంఘం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు విడుదల చేయడంతో రూ.403 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని, పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలను నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులను ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలోని అభివృద్ధి పనులను వివరించారు. పంచాయతీగా ఉన్న నిడదవోలు పట్టణం 1964లో మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 11వ తేదీన గణపతి సెంటర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతిదేవి, ఆరుగొళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయండి

దేవరపల్లి: గ్రామాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కుప్పాల వెంకటకనక దుర్గారావు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో ఉన్నందున ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గృహనిర్మాణశాఖ, విద్యుత్, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య తదితర శాఖల అధికారులు వారి పరిధిలోని అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, కొర్లపాటి అరుణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఆచారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

గోపాలపురం: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన పెర్నాడ కృష్ణారావు (60) గోపాలపురం వచ్చి మధ్యాహ్నం నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. ఎండ వేడికి స్పృహతప్పి పడిపోవడంతో వడదెబ్బతగిలినట్టు కుటుంబసభ్యులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజంలో మహిళలను గౌరవించాలి

కొవ్వూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలు గౌరవించాలని, వారికి అందిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని న్యాయవాది పీవీపీ లక్ష్మి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమవేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎం శ్రీవల్లీ, పి.హారీష్, ఎంపీడీవో కె.సుశీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిదారులే జగనన్న ప్రచారాస్త్రాలు

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- 1393 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ


నిడదవోలులో మహిళలకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనలో పథకాలు పొందిన లబ్ధిదారులే జగనన్న ప్రచారాస్త్రాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు కాపు కల్యాణ మండపంలో కోరుమామిడి, కాటకోటేశ్వరం, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం, తాళ్లపాలెం, రావిమెట్ల, సింగవరం, శెట్టిపేట, అట్లపాడు, కలవచర్ల, సమిశ్రగూడెం, డి.ముప్పవరం, పెండ్యాల, మునిపల్లి, విజ్జేశ్వరం గ్రామాలకు చెందిన 1393 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చటమే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రూ.1.13 కోట్లతో అభివృద్ధి పనులు


కొవ్వూరు పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు: మండలంలో స్థానిక ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు 15వ ఆర్థిక సంఘం నుంచి వివిధ గ్రామాల్లో 17 పనులు చేపట్టేందుకు రూ.33.75నిధులు వెచ్చించనున్నట్లు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) తెలిపారు. గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో గృహ నిర్మాణ సంస్థ నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం పనుల నిమిత్తం వివిధ పనులకు రూ.42,57,662 నిధులు వెచ్చించాలని సమావేశంలో తీర్మానించారు. మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరు పై ఆయా శాఖల అధికారులు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, ఎంపీడీవో కె.సుశీల, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

పెరవలి: మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏరాట్లు పూర్తి చేశారు. ఆలయాల ముందు చలువ పందెళ్లు, విద్యుద్దీపాలు, భారీకేట్ల ఏర్పాటు చేశారు. వశిష్ఠ గోదావరీ తీరాన మల్లేశ్వరం గ్రామంలో స్వయంభూగా వెలసిన కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవాలయం ఒక విశిష్ఠత సంతరించుకుంది. ఈ శివాలయంలో ఉన్న శివలింగం నిత్యం జలాదీవాస దీక్షలో ఉంటుంది. ఇలా నీళ్లలో శివలింగం మునిగి ఉండడం రాష్ట్రంలో ఎక్కడా లేకపోవడంతో ఈ దేవాలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలసిల్లుతోంది. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అబివృద్ధి కమిటీ చెప్పారు. దూరప్రాంత భక్తుల కోసం భోజన వసతి కల్పించామని మధ్యాహ్నం నుంచి రథోత్సవం జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి కాటకూటేశ్వర లింగేశ్వరుని కల్యాణోత్సవాలు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఉమా కాటకూటేశ్వర లింగేశ్వర స్వామి 61వ వార్షికోత్సవ కల్యాణోత్సవాలు ఈనెల 8 తేదీ నుంచి 17వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందెళ్లు సిద్ధం చేశారు. 8న స్వామి వారికి అభిషేకాలు, సినీ సంగీతవిభావరి, కోలాటం, అన్నసమారాధన, 9న బుర్రకథ, 10న ఏలూరు సుప్రీమ్ ఆర్కెస్ట్రా, 11న స్వామివారి ఊరేగింపు, సేవ, 12న దేవనర్తకి నాటకం, 13న కూచిపూడి నృత్యప్రదర్శన, 14న మోహన్ ఆర్కెస్ట్రా, 15న మ్యూజిక్ షో, మిమిక్రి, 16న కైలాసంలో కోర్టు నాటకం, 17న తేదీన భారీ అన్నసమారాధన, 22న భావన సినీ ఆర్కెస్ట్రా, సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కంసాలిపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, సమిశ్రగూడెం, పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కాటకోటేశ్వరంలో కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

అనంతపల్లిలో శివరాత్రి ఉత్సవాలు

నల్లజర్ల: వేంగీరాజుల చారిత్రక ఆనవాళ్లకు నిలయమైన అనంతపల్లిలోని బాలాత్రిపురసుందరీ సమేత వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిక్కాలనాగేశ్వరావు, ఈఓ మద్దిరాల లక్ష్మీశరణ్య తెలిపారు. ఇక్కడ నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో రూ.3లక్షలతో రథం కొనుగోలు చేసి ఈ ఏడాది ఉత్సవాల్లో స్వామివారిని ఊరేగించనున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియిలో ఉంటున్న అనంతపల్లి వాసి నల్లజర్ల మౌళీ రూ.4లక్షలతో స్వామివారి కల్యాణోత్సవానికి ప్రత్యేకంగా 80 అడుగుల విస్తీర్ణంలో ఓపెన్‌టాప్ ఉత్తరం వైపు ఏర్పాటు చేశారన్నారు. హైదరాబాదుకు చెందిన శేషవరపు సూర్యారావు జ్ఞాపకార్థం భార్య భారతీలక్ష్మి రూ.లక్షతో గోడలపై పాలరాతితో ద్వాదశ జ్యోతిర్లింగాలు, గ్రానైట్‌పై రూ.1లక్షలతో నల్లజర్ల వంశస్తులు అష్టాదశ శక్తి పీఠాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈవి శివరాత్రిరోజున ప్రారంభిస్తారన్నారు. తెలికిచెర్లలో ప్రకటేశ్వరస్వామి ఆలయంలో, దూబచర్ల లలిత కామేశ్వర స్వామి ఆలయంలో, నల్లజర్ల చంద్ర మౌళీశ్వరాలయం, పోతవరం శివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామి ఆలయం



కాటకూటేశ్వరం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన భారీ విద్యుత్‌దీపాల సెట్టింగులు

భక్తులకు అసౌకర్యాల్లేకుండా చర్యలు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి
- గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్

కొవ్వూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోష్పాదక్షేత్రానికి తరలివచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాల్లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌లు ఆదేశించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రంలో ఏర్పాట్లని పరిశీలించారు. భక్తులకు తాగునీరు సరఫరా, క్షేత్రంలో పారిశుధ్యం, విద్యుత్‌లైట్లు ఏర్పాటు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటుకి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాని కోరారు. ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయించాలని సూచించారు.భద్రతను దృష్టిలో ఉంచుకుని క్షేత్రంలో అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. పార్కింగ్‌కి, ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయం వద్ద దర్శనానికి ఏవిధమైన తొక్కిసలాట లేకుండా ఉండేందుకు బారీకేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రంలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరగుపరచడమే కాకుండా స్నానఘట్టంలో బీచింగ్ చేయించాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ కె.డానియేలు జోసఫ్, తహసీల్దార్ కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్

ఎన్నికల మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటిలించాలి

కొవ్వూరు: ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంసీసీ వీడియో వ్యూవింగ్ టీంలు, అకౌంటింగ్ టీంలకు నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వివిధ బాధ్యతలు కేటాయించిన అధికారులు, సిబ్బంది నిబద్ధతతో జవాబు దారీతనంలో పనిచేయాలని కోరారు. ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల న్నారు. ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆయా బృందాలు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై శిక్షణలో తెలియజేశారు. సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ట్రాఫిక్‌పై దృష్టి

తాళ్లపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించినట్టు తాళ్లపూడి ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు. గురువారం బజార్ సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మార్కెట్లో పర్యటించి సిబ్బందికి, వాహనదారులకు జాగ్రత్తలు చెప్పారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలకు పాటించాలని కోరారు. మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే భారీ వాహనాలు మెయిన్ రోడ్డులోకి రాకుండా దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ విషయంలో ఎప్పటికప్పుడు తమ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.